సాక్షి జనగామ

ఆదివారం । 18 । ఆగస్టు । 2024



పారదర్శకంగా పీహెచ్‌డీ అడ్మిషన్లు

కేయూలోని వివిధ విభాగాల్లో 2021–22లో ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారమే పీహెచ్‌డీ అడ్మిషన్లు కల్పించాలని ఇన్‌చార్జ్ వీసీ వాకాటి కరుణ ఆదేశించారు. - 8లో▸



మెరిసిన కీర్తి సురేష్

హనుమకొండ నక్కలగుట్టలో జోస్ ఆలుక్కాస్ నూతన షోరూం ప్రారంభంలో సినీనటి కీర్తి సురేష్ మెరిసింది. - 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం $34^0/24^0$

ఉదయం నుంచి చల్లని వాతావరణం ఉంటుంది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశం ఉంది. మధ్యాహ్నం సమయంలో సాధారణ ఉష్ణోగ్రతలు ఉంటాయి.

న్యూస్‌రీల్

ఎమ్మెల్యే చొరవతో నీరు విడుదల



జనగామ రూరల్: ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి చొరవతోనే అశ్వారావుపల్లి రిజర్వాయర్ నుంచి చీటకోడూర్ రిజర్వాయర్‌లోకి నీరు విడుదల చేశారని మున్సిపల్ చైర్‌పర్సన్ పి.జమున అన్నారు. శనివారం చీటకోడూర్ డ్యాంలోకి కాల్వల ద్వారా నీరు వస్తుండడంతో గంగమ్మకు పూలు చల్లారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. చీటకోడూర్ రిజర్వాయర్‌లో నీరు లేక పట్టణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, నీరు విడుదల చేయాలని ఇరిగేషన్ అధికారులకు ఫోన్ ద్వారా తెలపడంతో శనివారం డ్యాంకు నీరు చేరుకున్నట్లు పేర్కొన్నారు. గాడిపెల్లి ప్రేమలతారెడ్డి, సురేష్ రెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



తరిగొప్పుల: ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందుతాయి.. రుణమాఫీపై అపోహలు పెట్టుకోవద్దని జిల్లా వ్యవసాయ అధికారి వినోద్‌కుమార్ అన్నారు. సాధారణ క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా శనివారం పోతారం గ్రామంలో ఆయన పర్యటించి వ్యవసాయ క్షేత్రాలలో రైతులు ఏఏ పంటలు సాగు చేశారన్న వివరాలు నమోదు చేశారు. అనంతరం జీపీ ఆవరణలో రైతులతో మాట్లాడుతూ రేషన్ కార్డు లేని, రుణం రూ.2 లక్షలు దాటిన రైతులకు నాలుగో విడతలో పంట రుణాలు మాఫీ అవుతాయని చెప్పారు. ఎవరూ అధైర్య పడాల్సిన అవసరం లేదని, రుణమాఫీ కాని రైతుల కోసం ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసి దరఖాస్తులు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో ఏఈఓ రేష్మ పాల్గొన్నారు.

కోదండరాంను కలిసిన ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు



జనగామ రూరల్: ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంను నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులు శనివారం హైదరాబాద్ తార్నాకలో మార్యదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. గత ప్రభుత్వ జీఓ 510 తీసుకొచ్చి ఎన్‌హెచ్‌ఎంలో పనిచేస్తున్న ఉద్యోగులకు అన్యాయం చేసిందని, తమ సమస్యలు పరిష్కరించాలని ఆయనను కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శి రామ రాజేష్, కన్నా, జిల్లా ప్రధాన కార్యదర్శి గణేష్, రమేష్, మల్లేషం, లోకేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సోమనాథుడి పేరు పెట్టాలి

పాలకుర్తి టౌన్: ఉమ్మడి విద్యా సంస్థల విభజనలో భాగంగా ఏర్పడనున్న తెలుగు విశ్వవిద్యాలయానికి పాల్కురికి సోమనాథుడి పేరు పెట్టాలని సాహితీవేత్త, అధ్యాపకుడు డాక్టర్ శంకరమంచి శ్యాంప్రసాద్ అన్నారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ కవులు, కళాకారులకు అన్యాయం జరిగిందని, అప్పుడు రాజమండ్రిలో ఏర్పాటు చేసిన విశ్వవిద్యాలయానికి నన్నయ్య పేరు.. రాయలసీమ కడపలో ఏర్పాటు చేసిన విశ్వవిద్యాలయానికి వేమన పేరు పెట్టారని, తెలంగాణ నల్లగొండలో ఏర్పాటు చేసిన విశ్వవిద్యాలయానికి మాత్రం సోమనాథుడి పేరు పెట్టకుండా మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయంగా నామకరణం చేశారన్నారు. తెలుగు విశ్వవిద్యాలయానికి సోమనాథుడి పేరు పెట్టాలని డిమాండ్ చేశారు.

మారణకాండకు నిరసన



పాలకుర్తి టౌన్ : బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న మారణకాండకు నిరసనగా మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో శనివారం రాత్రి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. హిందూ సంఘాల ఐక్యవేదిక, హిందూ వాహిని, హనుమాన్ భక్త మండలి, అఖిల భారత హిందూ భక్తజన పరిరక్షణ మండలి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమానికి హిందువులు సంఘీభావం తెలియజేశారు.



ఈ ఫొటోలో అంబులెన్స్ నుంచి దిగుతున్న మహిళ పేరు నడిపి మల్లమ్మ. జనగామ మండలం గానుగుపహాడ్ గ్రామానికి చెందిన ఈమె కొంత కాలంగా మెడ నరాలు, ఛాతి నొప్పితో బాధపడుతోంది. శనివారం నొప్పి అధికం కావడంతో అంబులెన్స్ ద్వారా జిల్లా ఆస్పత్రికి చేరుకుంది. ఇక్కడికి వచ్చాక ఓపీ బంద్ ఉందని తెలియడంతో ఏమి చేయాలో తోచక ఆస్పత్రి లోపలికి వెళ్లి అక్కడే ఉండిపోయింది.



పక్క ఫొటోలోని వ్యక్తి పేరు పెండ్లి సోమయ్య. లింగాలఘణపురం మండలం పటేల్‌గూడెంకు చెందిన ఈయన ఎనిమిది రోజుల క్రితం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి రాగా.. ఏడు రోజుల క్రితం బీజం ఆపరేషన్ చేశారు. 'నాలుగు రోజులుగా ఓపీ సేవలు నిలిచి పోవడం.. ఎమర్జెన్సీ వైద్యం మాత్రమే అందిస్తుండడంతో కొంత ఇబ్బంది తప్పడం లేదు' అని సోమయ్య పేర్కొన్నారు. ఉదయం, సాయంత్రం రెగ్యులర్‌గా పరీక్షలు చేస్తున్నా.. డ్రెస్సింగ్‌కు రెండు రోజుల సమయం పడుతోందని అన్నారు.

సూది మందుతో సరి..

జిల్లా ఆస్పత్రిలో నాలుగో రోజూ ఓపీ సేవలు బంద్

- వైద్య విద్యార్థిని హత్యకు నిరసన..
- వైద్యుల ఆందోళనకు ప్రైవేట్ ఆస్పత్రుల మద్దతు
- డాక్టర్ల భారీ ర్యాలీ.. సీఎం మమతా బెనర్జీ దిష్టిబొమ్మ దహనం
- రోగులకు తప్పని ఇబ్బందులు



ఓపీ నిలిచి పోవడంతో జిల్లా ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న జనరల్ వార్డు

జనగామ రూరల్: కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై లైంగిక దాడి.. హత్యను నిరసిస్తూ వైద్యులు చేపట్టిన నిరసన దీక్షలు శనివారం నాలుగో రోజు కొనసాగాయి. జిల్లా ఆస్పత్రిలో ఓపీ సేవలు నిలిపి వేసి.. ఎమర్జెన్సీ వైద్యం మాత్రమే అందిస్తున్నారు. అడ్మిట్ అయిన పేషంట్లకు సూది మందుతో సరిపెడుతున్నారు. శనివారం ఉదయం 10.30 గంటల సమయంలో ఓపీ విభాగంలో ఒకరిద్దరు తప్ప అంతా ఖాళీగా కనిపించింది. సేవలు నిలిచి పోయాయనే ప్రచారం నేపథ్యంలో పట్టణంతోపాటు పల్లె ప్రాంతాలకు చెందిన ప్రజలు ఆస్పత్రికి రాలేదు. వచ్చిన కొద్ది మంది ఓపీ సేవలు లేకపోవడంతో ఇబ్బంది పడ్డారు. జిల్లా పరిధి పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల్లో కొన్నింటిలో ఓపీ సేవలు కొనసాగగా.. మరికొన్ని ఆస్పత్రుల్లో నిలిపి వేసి వైద్యులు జిల్లా కేంద్రంలో నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.

నిరసన ర్యాలీ.. మమతా బెనర్జీ దిష్టిబొమ్మ దహనం

వైద్య విద్యార్థిని హత్యను నిరసిస్తూ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో నిరసన ర్యాలీ చేపట్టారు. మెడికల్ కళాశాల ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులు, వైద్య సిబ్బంది, వైద్య విద్యార్థులు, అన్ని విభాగాల కార్మికులు, అంబులెన్స్ సిబ్బంది పాల్గొన్నారు. జిల్లా ఆస్పత్రి నుంచి నెహ్రూపార్కు మీదుగా నల్ల బ్యాడ్జీలు ధరించి, ప్లకార్డులు చేతబూని నినాదాలు చేస్తూ ఆర్టీసీ చౌరస్తాకు చేరుకున్నారు. అనంతరం పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ దిష్టిబొమ్మను దహనం చేసి.. పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దుండగులను పట్టుకోవడంలో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జలగం విజయ్‌కుమార్, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. హంతకులను వెంటనే పట్టుకుని శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రిటైర్డ్ కల్నల్ భిక్షపతి, కర్నాకర్, దుర్గాప్రసాద్, జూనియర్ డాక్టర్స్ అసోషియేషన్ ప్రతినిధి, డాక్టర్ విశ్వసంతోష్, శ్రీకాంత్, ఈశ్వర్, శ్యాంభాజ్, వంశీ, రజినీ తదితరులు పాల్గొన్నారు.

ఎమర్జెన్సీలో..

జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఎమర్జెన్సీ సేవల విషయంలో డాక్టర్లు, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉన్నారు. ఆస్పత్రి గ్రౌండ్ ఫ్లోర్, మొదటి, రెండవ అంతస్తులోని జనరల్ వార్డుల్లో వివిధ అనారోగ్య సమస్యలతో అడ్మిట్ అయిన 40 మంది రోగులు ఉన్నారు. వారిని ఉదయం సమయంలో డాక్టర్లు పరీక్షించగా.. మధ్యాహ్నం, సాయంత్రం వైద్య సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు.



జిల్లా ఆస్పత్రిలో వైద్య సేవలు అందిస్తున్న సిబ్బంది

ఎమర్జెన్సీ కింద అడ్మిట్ చేసుకున్నారు..



జ్వరంతో మూడు రోజుల క్రితం జిల్లా ఆస్పత్రికి వచ్చాను. ఓపీ సేవలు లేకున్నా.. ఎమర్జెన్సీ కింద అడ్మిట్ చేసుకున్నారు. డాక్టర్లు, నర్సులు ఎప్పటికప్పుడు చూస్తున్నారు. ఎలాంటి ఇబ్బంది లేదు.

- మంద అఖిల, విద్యార్థిని, శామీర్‌పేట

నర్సులు సేవలందిస్తున్నారు..



పొలం వద్ద పనులు చేస్తుండగా కాలుకు కొయ్య గుచ్చుకుని రక్తం వచ్చింది. కుటుంబ సభ్యులు జిల్లా ఆస్పత్రికి తీసుకు వచ్చారు. మూడు రోజులుగా వైద్యం అందిస్తున్నారు. మందులు ఇస్తున్నారు. డాక్టర్ చూడలేదు కానీ.. నర్సులు వచ్చి సేవలు అందిస్తున్నారు.

- దండు కొమురమ్మ, మరిగడి, జనగామ

నిరసన కార్యక్రమానికి పలు స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు, ప్రముఖులు మద్దతు పలికారు.

ప్రైవేట్ ఆస్పత్రుల్లో నిలిచిన ఓపీ

పట్టణంతోపాటు జిలా వ్యాప్తంగా సుమారు 90 ప్రైవేట్ ఆస్పత్రుల్లో శనివారం ఓపీ సేవలు నిలిపి వేసిన యజమానులు వైద్యులకు మద్దతు పలికారు. ఐఎంఏ దేశ వ్యాప్త పిలుపులో భాగంగా జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 24 గంటల బంద్‌ను విజయవంతం చేశారు.



జిల్లా ఆస్పత్రిలో రోగులు లేక వెలవెల బోతున్న ఓపీ సెంటర్



ర్యాలీగా వస్తున్న వైద్యులు, వైద్య విదార్థులు, సిబ్బంది



మమతా బెనర్జీ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న వైద్యులు, విద్యార్థులు

బచ్చన్నపేటలో విధుల బహిష్కరణ



నిరసన తెలుపుతున్న వైద్య సిబ్బంది

బచ్చన్నపేట : మండల కేంద్రంలోని సీహెచ్‌సీ, పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య విద్యార్థిని హత్యచేసిన దుండగులను బహిరంగంగా ఉరితీయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సుప్రజ, సీహెచ్‌ఓ జంగమ్మ, స్టాఫ్ నర్సు జయశ్రీ, జ్యోతి, ఫార్మసిస్ట్ బొడ్డు శ్రీనివాస్, రాజు, లలిత, శ్వేత, నగేష్, యాదగిరి, రమేష్ పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన



రఘునాథపల్లి పీహెచ్‌సీ వద్ద నిరసన తెలుపుతున్న వైద్యులు, సిబ్బంది

రఘునాథపల్లి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. వైద్య విద్యార్థిని హత్యకు నిరసనగా చేపట్టిన ఆందోళనకు సంఘీభావంగా ఉదయం గంట పాటు వైద్య సేవలు నిలిపి వేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ కమల్‌హాసన్ మాట్లాడుతూ దుండగులను కఠినంగా శిక్షించి వైద్య సిబ్బందిపై ఎలాంటి దాడులు జరగకుండా భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. హెల్త్ అసిస్టెంట్లు విష్ణువర్ధన్‌రెడ్డి, పాండారి, సిబ్బంది పాల్గొన్నారు.

రోగులకు తప్పని తిప్పలు



ఓపీ చూస్తున్న ఫిజియోథెరపీ డాక్టర్ రవికుమార్

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో వివిధ గ్రామాల నుంచి వైద్య సేవల కోసం వచ్చిన ప్రజలు ఇబ్బంది పడ్డారు. స్థానిక సీహెచ్‌సీ, పీహెచ్‌సీలో సూపరింటెండెంట్‌తో పాటు 8 మంది వైద్య సేవలు అందిస్తారు. శనివారం ఫిజియోథెరపిస్టు డాక్టర్ రవికుమార్ మాత్రమే ఉన్నారు. వచ్చిన రోగులకు ఆయన ఓపీ చూసి మందులు రాసిచ్చారు. వారు తప్పనిసరి పరిస్థితుల్లో వైద్య సిబ్బంది ఇచ్చిన మందులు తీసుకుని వెళ్లారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లోనూ ఓపీ బంద్ చేశారు.

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి

- సీనియర్ సివిల్ జడ్జి విక్రమ్

జనగామ రూరల్: ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని సీనియర్ సివిల్ జడ్జి సి.విక్రమ్ అన్నారు. శనివారం పట్టణంలోని సబ్ జైలును సందర్శించిన ఆయన.. ఖైదీలతో మాట్లాడుతూ.. మంచి ఆలోచన కలిగి ఉండాలని, నేరాల వైపు పోవద్దని, చట్టాలపై అవగాహన పెంచుకోవాలని చెప్పారు. కొంత మంది ఖైదీలకు రెండు మూడు కేసులు ఉండడం వల్ల వస్తున్న ఎస్కార్ట్ ఇతర సమస్యలను ఎలా పరిష్కరించుకోవాలో.. జైలు సూపరింటెడెంట్‌కు జడ్జి వివరించారు. ఖైదీలకు వంటలు, ఫోన్ సదుపాయం, ములాఖత్ గురించి ఆరా తీశారు. తప్పనిసరిగా కంప్లైంట్ బాక్స్ ఉండాలని, దానిని ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సబ్ జైలర్ కృష్ణకాంత్, మంచాల రవీందర్, జ్యోత్స్న, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



ఖైదీల సమస్యలు తెలుసుకుంటున్న జడ్జి విక్రమ్

'ఓపెన్' కోర్సులను వినియోగించుకోవాలి

- ఘన్‌పూర్ ఆర్డీఓ డీఎస్ వెంకన్న

స్టేషన్‌ఘన్‌పూర్: చదువు మధ్యలో మానేసిన వారికి రాష్ట్ర ప్రభుత్వం దూరవిద్య విధానంలో అందిస్తున్న ఓపెన్ టెన్త్, ఇంటర్ కోర్సులను వినియోగించుకోవాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీఓ డీఎస్ వెంకన్న అన్నారు. తెలంగాణ ఓపెన్‌స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు సంబంధించిన వాల్ పోస్టర్లను శనివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఓపెన్‌స్కూల్ ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ ఎం.శంకర్‌రావుతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దూరవిద్య ఎంతో సులభమైనదని, ఆన్‌లైన్‌లో సంబంధిత రుసుము చెల్లించి సెప్టెంబర్ 10లోపు ప్రవేశాలు పొందాలని సూచించారు. పూర్తి వివరాలకు ఓపెన్‌స్కూల్ అధ్యయన కేంద్రాల కోఆర్డినేటర్లను సంప్రదించాలని చెప్పారు. కార్యక్రమంలో డీసీఈబీ జిల్లా సెక్రటరీ చంద్రభాను, మండల నోడల్ అధికారి కొమురయ్య, ఘన్‌పూర్ జెడ్పీఎస్ఎస్ హెచ్‌ఎం సంపత్, అసిస్టెంట్ కోఆర్డినేటర్ రవికుమార్, అశోక్, ఎమ్మార్సీ సిబ్బంది గిరి, జ్యోతి, రమేష్, సీఆర్‌పీ లవన్, శ్రీకాత్ పాల్గొన్నారు.

వెంకన్నకు వెండి వస్తువుల బహూకరణ



కల్యాణంలో పాల్గొన్న భక్తులు



వెండి వస్తువులు అందజేస్తున్న దాతలు

చిల్పూరు: శ్రీ బుగులు వెంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం హైదరాబాద్‌కు చెందిన కామధేను వేద విద్యాపీఠం ట్రస్టు చైర్మన్ చిలుకూరి నాగేంద్ర కుమార్ వెండి పళ్లెంతో పాటు పసుపు, కుంకుమ, గంధం, అక్షింతల గిన్నెలను బహూకరించారు. ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఆలయ ఈఓ భాగం లక్ష్మీప్రసన్న, జూనియర్ అసిస్టెంట్ మోహన్ ఆధ్వర్యంలో వస్తువులనను అర్చకులకు అందజేశారు. కార్యక్రమంలో తెలుగు భాషా పండిత సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సిద్ధోజు శ్రీనివాసాచారి, అప్పయ్య శాస్త్రి, రాంబ్రహ్మచారి తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. ఆలయంలో స్వామి వారికి అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యుల ఆధ్వర్యాన వార కల్యాణం వైభవంగా నిర్వహించారు. మళ్లికుదుర్లకు చెందిన మండల కుమారస్వామి–కళ్యాణి దంపతులు భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. ఆలయ శాశ్వత అభివృద్ధి దాత పొట్లపల్లి శ్రీధర్‌రావు–కిరణ్మయి, ఉత్సవ కమిటీ చైర్మన్ మామిడాల యాదవరెడ్డి దంపతులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఆదాయం పెంచాలి

- కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్: మున్సిపల్ ఆదాయం పెంచాలి.. ఇందుకు అధికారులు ప్రణాళిక బద్ధంగా కృషి చేయాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్‌తో కలిసి సంబంధిత అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పన్నుల వసూలు, ట్రేడ్ లైసెన్స్, ప్రచార హోర్డింగ్‌లు, భవన నిర్మాణ అనుమతులు, రెంటల్ చార్జీలతో పురపాలిక ఆదాయం పెంచాలని చెప్పారు. ఏడాదికి రెండు సార్లు పన్నుల వసూల క్రమబద్ధీకరణ జరగాలని, వసూలులో జాప్యం చేయొద్దని సూచించారు. లైసెన్స్ జారీ, రెన్యూవల్ వసూళ్లకు ప్రత్యేక మేళాలు నిర్వహించాలని పేర్కొన్నారు. నూతన భవన నిర్మాణాలకు అనుమతులు ఇస్తూ.. అనుమతి లేని వాటిని తొలగిస్తూ నివేదిక అందించాలని అన్నారు. అన్నిరంగాల్లో ప్రగతి సాధించిన వార్డులను గుర్తించి ఉత్తమ అవార్డులు అందజేస్తామని, ఈనెల 15 నుంచి సెప్టెంబర్ 15 వరకు స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమాలను పొడిగించినట్లు స్పష్టం చేశారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా, పక్కన ఇతర అధికారులు

జ్వరాలతో ప్రాణాలు కోల్పోవద్దు

వైద్యులు 24 గంటలు అందుబాటులో ఉండాలి.. అవసరమైన మందులు సమకూర్చుకోవాలి.. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో తప్పనిసరిగా రక్త పరీక్షల నమూనాలు సేకరించాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా ఆదేశించారు. ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని, నిర్లక్ష్యం వహించొద్దని స్పష్టం చేశారు. ఆస్పత్రుల వారీగా ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని ఆదేశించారు.

స్కూళ్లు, హాస్టళ్లను శుభ్రంగా ఉంచాలి

'స్వచ్ఛదనం–పచ్చదనం' కార్యక్రమాన్ని నెల రోజుల పాటు పొడిగించినందున జిల్లాలోని స్కూళ్లు, హాస్టళ్లను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. పిచ్చిమొక్కలు, చెత్తను తొలగించి మురుగు నీరు నిల్వ లేకుండా చూడాలని, మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచాలని చెప్పారు. విద్యార్థులకు అందజేసే ఆహారంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, స్టాక్ రిజిస్టర్ నిర్వహించాలని ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని అవసరమైన వైద్యం అందించాలని, అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించాలని పేర్కొన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ సరిత, డీఆర్‌డీఓ వసంత, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ గోపాల్‌రావు, డీఎంహెచ్‌ఓ రవీందర్, సంక్షేమాధికారులు రవీందర్, దయానందరాణి తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా పకడ్బందీగా రూపొందించాలి

- రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి

జనగామ రూరల్: 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయాలి.. జాబితాను పకడ్బందీగా రూపొందించి ఈనెల 20 నుంచి బీఎల్‌ఓలు ఇంటింటి సర్వే చేపట్టాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి.సుదర్శన్‌రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. జనవరి ఒకటో తేదీ ప్రామాణికంగా ఓటరు జాబితా రూపొందించి, ఓటరు నమోదు ప్రక్రియపై అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించాలన్నారు. ఈనెల 20 నుంచి అక్టోబర్ 28 వరకు ప్రీ రివిజన్ నిర్వహించి 29న ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేయాలని చెప్పారు. డిసెంబర్ 24 లోగా అభ్యంతరాలు స్వీకరించి జనవరి 6న తుది జాబితా సిద్ధం చేసి అందులో లాజికల్, డెమోగ్రాఫికల్ పొరపాట్లు సరిచేయాలన్నారు. మరణించిన, శాశ్వతంగా వలస వెళ్లిన వారి వివరాలు ఫారం 7 ద్వారా తొలగించాలని తెలిపారు. 1,500 ఓటర్లున్న పోలింగ్ కేంద్రాన్ని క్రమబద్ధీకరించి అవసరమైన చోట నూతన కేంద్రం ఏర్పాటు చేయాలని సూచించారు. కలెక్టర్ రిజ్వాన్ బాషా, ఆర్డీఓలు పాల్గొన్నారు.

సోమనాథుడి స్మృతి వనం సందర్శన



పాలకుర్తి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు 250 మంది పాల్కురికి సోమనాథుడి స్మృతి వనాన్ని శనివారం సందర్శించారు. ప్రతీ నెల మూడో శనివారం నిర్వహిస్తున్న 'నోబ్యాగ్ డే'లో భాగంగా విద్యార్థులు ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా సోమనాథుడి రచనలు, వీరశైవ ప్రాశస్త్యం, బసవ పురాణంలోని ప్రత్యేక అంశాలను ఉపాధ్యాయులు వారికి వివరించారు. హెచ్‌ఎం పి.శోభారాణి, ఉపాధ్యాయులు నరసింహమూర్తి, అశోక్, తమ్మి మధు, మాలతిశోభ, సమత, వెంకటయ్య, రామకృష్ణ, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

- పాలకుర్తి టౌన్

డేవిడ్ ఇజ్రాయిల్‌తో దీపక్ గార్గ్ భేటీ



హసన్‌పర్తి : ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ విశ్వ విద్యాలయ గ్లోబల్ ఎడ్యుకేషన్ స్ట్రాటజీ డైరెక్టర్ డేవిడ్ ఇజ్రాయిల్‌తో ఎస్సార్ యూనివర్సిటీ వీసీ దీపక్ గార్గ్ శుక్రవారం భేటీ అయ్యారు. డేవిడ్ ఇజ్రాయిల్ ఇటీవల తెలంగాణ రాష్ట్రంలో పర్యటించగా ఆయనను ఎస్సార్ యూనివర్సిటీ వీసీ దీపక్ గార్గ్ హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా ఎస్సార్ యూనివర్సిటీలో బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ అడ్వాన్స్‌డ్ ఆనర్స్ డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రాం ప్రారంభించేందుకు భాగస్వామ్యం గురించి డేవిడ్ ఇజ్రాయిల్‌తో దీపక్ గార్గ్ చర్చించారు.

పీహెచ్‌డీ అడ్మిషన్లు పారదర్శకంగా చేపట్టాలి

● కేయూ ఇన్‌చార్జ్ వీసీ వాకాటి కరుణ



వీడియో కాన్ఫరెన్స్‌లో రిజిస్ట్రార్ మల్లారెడ్డి, వివిధ విభాగాల అధిపతులు, బీఓఎస్‌లు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో సోషల్‌సైన్స్, సైన్స్, ఫార్మసీ, కామర్స్, ఇంజినీరింగ్, ఎడ్యుకేషన్, లా, తదితర విభాగాల్లో 2021–2022లో ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారం ఇప్పటికే అడ్మిషన్ల ప్రక్రియ పూర్తికాగా లెఫ్ట్‌ఓవర్ వేకెన్సీల్లో మెరిట్ జాబితా ప్రకారమే పీహెచ్‌డీ అడ్మిషన్లను పారదర్శకంగా చేపట్టాలని కేయూ ఇన్‌చార్జ్ వీసీ వాకాటి కరుణ ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా క్యాంపస్‌లోని పరిపాలన భవనంలో అకడమిక్ కమిటీ హాల్‌లో అన్ని విభాగాల డీన్లు, విభాగాల అధిపతులు, బీఓఎస్‌లతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వారం రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తిచేయాలన్నారు.గతంలో నిర్వహించిన ప్రవేశపరీక్షలోని మెరిట్‌జాబితా ప్రకారంగానే పీహెచ్‌డీ అడ్మిషన్ల ప్రక్రియ పారదర్శకంగా పూర్తిచేయాలన్నారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా పూర్తిచేయాలని, పొరపాట్లు చేస్తే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో రిజిస్ట్రార్ పి. మల్లారెడ్డి, వివిధ విభాగాల డీన్లు టి. మనోహర్, ఎ. జ్యోతి, ఎస్. రాంనాథ్ కిషన్, జి. సమ్మయ్య, సదానందం, జి.హనుమంతు, ఎం.శ్రీనివాస్, అకడమిక్ విభాగం అసిస్టెంట్ రిజిస్ట్రార్ కోలశంకర్ తదితరులు పాల్గొన్నారు.

భవితకు నవోదయం..

● పల్లెల్లోని ప్రతిభావంతులకు నాణ్యమైన విద్య
● జవహర్ నవోదయ విద్యాలయం
● ఆరో తరగతికి దరఖాస్తుల ఆహ్వానం
● సెప్టెంబర్ 16 చివరి గడువు

ఖిలా వరంగల్ : ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్య.. ఉత్తమ విలువలు.. దేశభక్తి.. క్రీడలు.. నైపుణ్యం.. ఇలా అన్ని అంశాల్లో నాణ్యమైన విద్యనందిస్తోంది ఖిలావరంగల్ మండలం మామునూరులోని జవహర్ నవోదయ విద్యాలయం. ఈ నేపథ్యంలో ఈ విద్యాలయంలో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆరో తరగతిలో ప్రవేశానికి ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఐదో తరగతి చదువుతున్న విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ..

ఎనిమిదేళ్లుగా దరఖాస్తులను నవోదయ వెబ్‌సైట్ www.navodaya.gov.in ద్వారా ఆన్‌లైన్‌లో స్వీకరిస్తున్నారు. మొత్తం 80 సీట్లకు ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి గతేడాది 50 వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. ఈ విద్యాసంవత్సరానికి సంబంధించ సెప్టెంబర్ 16న చివరి తేదీగా ప్రకటించారు. 2025 జనవరి 18న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ పూర్ణిమ ప్రకటించారు.

జాగ్రత్తలు తప్పనిసరి..

దరఖాస్తు సమయంలో చాలా మంది తప్పులు చేస్తుంటారు. విద్యార్థి గ్రామం, ఏ నవోదయ విద్యాలయ పరిధిలో బ్లాక్‌ల పరిధిలోకి వస్తుంది అనేది వెబ్ సైట్‌లో పొందుపరిచిన వివరాలతో మొదట పరిశీలించుకోవాలి. అది తెలియకుండా నచ్చిన 15 బ్లాక్‌ను ఎంపిక చేసుకుంటే సీట్లు కోల్పోవాల్సి వస్తుంది. కొంత మంది విద్యార్థులు గ్రామీణ, పట్టణ విషయంలో చాలా మంది తప్పులు చేస్తున్నారు. సీట్లు పొందినా గ్రామీణ ప్రాంతమనే సర్టిఫికెట్‌ను తీసుకురాలేకపోవడంతో సీట్లు కోల్పోవాల్సి వస్తోంది.



మామునూరులోని నవోదయ విద్యాలయం

చక్కటి గ్రంథాలయం ఏర్పాటు

ఆరో తరగతి నుంచే కంప్యూటర్ విద్యాబోధన. విద్యాలయ ప్రాంగణంలో అధునాతన వసతులతో కూడిన సుమారు 50 వేలకు పైగా పుస్తకాలు కలిగిన చక్కటి గ్రంథాలయం ఏర్పాటు చేశారు. డిజిటల్ తరగతి గదులతో పాటు విద్యార్థులకు ప్రత్యేక ట్యాబ్‌లు ఇస్తారు.

గర్ల్స్ ఎంపవర్‌మెంట్ కింద విజ్ఞానజ్యోతి పథకంలో భాగంగా తొమ్మిది నుంచి 12వ తరగతి అమ్మాయిలకు నీట్, ఐఐటీ–జేఈఈ కోచింగ్‌కు రూ.8వేలు ఇస్తారు. 12వ తరగతికి చెందిన 40 మంది విద్యార్థులకు నెలకు రూ.వెయ్యి చొప్పున ఏడాదిపాటు ఉపకార వేతనం అందజేస్తారు. పదో విద్యార్థులకు నూతన ఆవిష్కరణలు పోత్సహించేందుకు సైన్స్ కిట్ ఇస్తారు. స్వచ్ఛంద సంస్థల ద్వారా, ఆన్‌లైన్ ద్వారా ఉచిత ఐఐటీ కోచింగ్ తరగతులు నిర్వహిస్తారు.

సీట్ల కేటాయింపు ఇలా..

విద్యాలయంలో 80 సీట్లు ఉన్నాయి. వీటిలో 60 (75శాతం) గ్రామీణ ప్రాంత విద్యార్థులకు, 25 శాతం పట్టణ ప్రాంతవాసులకు కేటాయిస్తారు, వీటిలో 15 శాతం ఎస్సీ, 7.5 శాతం ఎస్టీ, 3 శాతం దివ్యాంగులు, బాలికలకు 1/3 వంతు రిజర్వేషన్‌ను సీట్ల కేటాయింపులో అమలు చేస్తారు. ఎంట్రన్స్ టెస్ట్ మార్కుల మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.

అర్హులు ఎవరంటే..

3, 4, 5 తరగతులు ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో చదివి ఉండాలి. ఐదో తరగతి తప్పనిసరిగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో చదవాలి. అభ్యర్థులు 01-05-2013 నుంచి 31-07-2015 మధ్య జన్మించి ఉండాలి. అభ్యర్థి ఆధార్‌కార్డు తప్పనిసరిగా ఉండాలి. లేకుంటే తహసీల్దార్ కార్యాలయం నుంచి నివాస ధ్రువీకరణ పత్రం ఉండాలి.

సులభంగా సీటు పొందా..



నేను ప్రభుత్వ పాఠశాలలో చదివా. ఈసీటు నాకు వస్తుందా..? అని అపనమ్మకం ఉండేది. ఆరు నెలల పాటు క్రమశిక్షణ, పట్టుదలతో చదవడంతో సీటు సులభంగా పొందా. పాఠ్యాంశాలను బట్టీపట్టకుండా ప్రణాళిక ప్రకారం చదివితే విజయం సాధించొచ్చు.

– శ్రీవర్ధన్, ఆరో తరగతి విద్యార్థి

ఎంపిక పారదర్శకం



ప్రతి విద్యార్థికి ముందు క్రమశిక్షణ అలవాటు చేస్తాం. అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తాం. ఒత్తిడికి గురి కాకుండా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తాం. ఈ ఏడాది అత్యధికంగా దరఖాస్తులు వచ్చేలా విస్తృత ప్రచారం చేస్తున్నాం. ప్రతిభను నమ్ముకుని కష్టపడి చదివితే ఉత్తీర్ణత సాధించొచ్చు.

– పూర్ణిమ, ప్రిన్సిపాల్
నవోదయ విద్యాలయం మామునూరు

డెంగీ పీడితులకు మెరుగైన వైద్యసేవలు

● వైద్యారోగ్యశాఖ అడిషనల్ డైరెక్టర్ అమర్‌సింగ్
● ఎంజీఎం సందర్శన

ఎంజీఎం : డెంగీ జ్వర పీడితులకు మెరుగైన వైద్య సేవలందించాలని వైద్యారోగ్యశాఖ అడిషనల్ డైరెక్టర్ అమర్‌సింగ్ అన్నారు. ఈ మేరకు శనివారం ఎంజీఎంలోని పలు వార్డులను సందర్శించి డెంగీ జ్వర పీడితులకు అందిస్తున్న చికిత్సలను పరిశీలించారు. అనంతరం ఎంజీఎం సూపరింటెండెంట్ మురళితో కలిసి పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెంగీ మరణాలు సంభవించకుండా డీఎంహెచ్‌ఓ ఆధ్వర్యంలో పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎంజీఎం వైద్యులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ జ్వర పీడితులకు వైద్యసేవలందించాలన్నారు. ఎంజీఎం బ్లడ్‌బ్యాంక్‌లోని రక్తనిధి నిల్వలు ప్లేట్‌లెట్స్ బాధితులకు సరిపోయేలా అందించేందుకు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అనంతరం పీహెచ్‌సీ వైద్యాధికారులతో జూమ్ మీటింగ్ నిర్వహించి వరంగల్ జిల్లాలో డెంగీ, మలేరియా వ్యాధి తీవ్రతను తెలుసుకుని పలు సూచనలు చేశారు.కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ వెంకటరమణ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ గోపాల్‌రావు, ఎంజీఎం ఆర్‌ఎంఓ మురళి, తదితరులు పాల్గొన్నారు.



ఎంజీఎం ఆస్పత్రిలో వార్డును పరిశీలిస్తున్న అడిషనల్ డైరెక్టర్ అమర్‌సింగ్

కలెక్టర్‌ను కలిసిన వైద్యారోగ్య శాఖ అడిషనల్ డైరెక్టర్ అమర్‌సింగ్

వరంగల్: రాష్ట్ర వైద్యారోగ్యశాఖ అదనపు డైరెక్టర్ అమర్‌సింగ్ శనివారం వరంగల్ కలెక్టర్ సత్యశారదను కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా వరంగల్ జిల్లాలో డెంగీ, చికెన్ గున్యా, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా నివారించేందుకు తీసుకుంటున్న జాగ్రత్తలు, తీసుకోవాల్సిన చర్యలపై ఇరువురు చర్చించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ వెంకటరమణ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ గోపాలరావు, ప్రోగ్రాం ఆఫీసర్ మోహన్‌సింగ్, జోనల్ మలేరియా ఆఫీసర్ సునీల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

జోస్ ఆలుక్కాస్ షోరూం ప్రారంభం



జోస్ ఆలుక్కాస్ షోరూంను ప్రారంభిస్తున్న సినీనటి కీర్తి సురేశ్, ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి, మేయర్ సుధారాణి

● సినీనటి కీర్తి సురేశ్ సందడి

హన్మకొండ: హనుమకొండ నక్కలగుట్టలో ఆభరణాల రిటైల్ రంగలో అగ్రగామి సంస్థ జోస్ ఆలుక్కాస్ షో రూం ప్రారంభమైంది. శనివారం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, మేయర్ గుండు సుధారాణి, ప్రముఖ సినీనటి కీర్తి సురేశ్ ప్రారంభించారు. రెండు ఫ్లోర్లలో ఏర్పాటు చేసిన షో రూంలో బంగారు, వజ్రాభరణాలను ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, మేయర్ గుండు సుధారాణి, కీర్తి సురేశ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అతిథిగా హాజరైన సినీ నటి కీర్తి సురేశ్ అభిమానులకు అభివాదం చేసి మాట్లాడుతూ చారిత్రక, వారసత్వ, పర్యాటక ప్రాంతం వరంగల్‌కు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. జోస్ ఆలుక్కాస్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్లు వరీస్ ఆలుక్కా, పాల్ జె ఆలుక్కా, జాన్‌ఆలుక్కా మాట్లాడుతూ హనుమకొండ నక్కలగుట్టలో కొత్తగా ఆభరణాల షోరూం ప్రారంభిస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. ఈ నెల 17 నుంచి 21వ తేదీ వరకు రూ.60వేల బంగారు, వజ్రాభరణాలు కొనుగోలు చేసిన కస్టమర్లకు ప్రోత్సాహకంగా బంగారు నాణెం ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. అదనంగా వజ్రాలపై 20 శాతం తగ్గింపు, ప్లాటినం ఆభరణాలపై 7 శాతం తగ్గింపు పొందొచ్చన్నారు. జోస్ ఆలుక్కాస్ షో రూంలో చేసిన ప్రతీ కొనుగోలుపై ఒక బహుమతి ఇస్తున్నట్లు తెలిపారు. జోస్ ఆలుక్కాస్ 60వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా ఆరు ఎంజీ ఆస్టర్ కార్లు, గృహోపకరణాలు, బంగారు నాణెలతో సహా రూ.6కోట్ల విలువైన బహుమతులు ప్రకటించినట్లు తెలిపారు.



ఆభరణాలు ప్రదర్శిస్తున్న సినీనటి కీర్తి సురేశ్

హ్యాండ్లూమ్ కాలేజీ ఏర్పాటు శుభపరిణామం

● చేనేత కార్మికుల పిల్లలకు ఉజ్వల భవిష్యత్
● రాష్ట్ర చేనేత జౌళిశాఖ ఓఎస్‌డీ హిమజకుమార్



మాట్లాడుతున్న రాష్ట్ర చేనేత జౌళిశాఖ ఓఎస్‌డీ హిమజకుమార్

వరంగల్: తెలంగాణ రాష్ట్రంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ(ఐఐహెచ్‌టీ) కాలేజీ ఏర్పాటు కావడం శుభపరిణామని రాష్ట్ర చేనేత జౌళిశాఖ ఓఎస్‌డీ హిమజకుమార్ అన్నారు. శనివారం కొత్తవాడలోని పద్మశాలీ ఫంక్షన్ హాల్‌లో కాలేజీ ఏర్పాటుపై చేనేత కార్మికుల కుటుంబాలకు అవగాహన కల్పించారు. ఈఏడాది ప్రారంభం కానున్న చేనేత, టెక్స్‌టైల్స్ డిప్లొమా కోర్సుల్లో చేరే విద్యార్థులు 10తరగతి లేదా సమానమైన పరీక్షల్లో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. 2024 జూలై 1నాటికి బీసీ, జనరల్ కేటగిరీ విద్యార్థులు గరిష్ట వయో పరిమితి 23 ఏళ్లు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 25 ఏళ్లు ఉండాలన్నారు. దరఖాస్తులు ఈనెల 7 నుంచి 31వ తేదీ వరకు స్వీకరిస్తారని, మూడేళ్ల కోర్సులో ఆరు సెమిస్టర్లు ఉంటాయన్నారు. ఈ కాలేజీలోని ప్రతి విద్యార్థికి రాష్ట్ర ప్రభుత్వం రూ.2500 ఉపకార వేతనం ఇస్తుందని తెలిపారు. ఏడాదికి రూ.4,050 మాత్రమే ఫీజు చెల్లించాలన్నారు. హైదరాబాద్ నాంపల్లి సమీపంలోని శ్రీపొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో వసతి సదుపాయాలు కల్పిస్తారని తెలిపారు. వసతికయ్యే ఖర్చులను విద్యార్థి తల్లిదండ్రులు భరించాల్సి ఉంటుందన్నారు. అనంతరం పలువురు పద్మశాలీ కార్మిక సంఘాల నాయకులు మాట్లాడారు. రాష్ట్ర అటవీశాఖ మంత్రి కొండా సురేఖ చొరవతో వరంగల్ జిల్లాలో టెక్స్‌టైల్స్ ఇంజనీరింగ్ కాలేజీ ఏర్పాటు చేస్తే చేనేత కార్మికుల పిల్లలు ఈ కోర్సులో శిక్షణ పొంది కాకతీయ టెక్స్‌టైల్స్ పార్కులో ఉద్యోగాలు వస్తాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు టీపీసీసీ చేనేత విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్ప వెంకటేశ్వర్లు తెలిపారు. దీంతో సీఎం రేవంత్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకొచ్చి హైదరాబాద్‌లో ఈవిద్యా సంవత్సరంలోనే 60 సీట్లతో చేనేత, టెక్స్‌టైల్స్ టెక్నాలజీ డిప్లొమా కోర్సులను ప్రవేశపెట్టారని తెలిపారు. ఈ సదస్సుకు అధ్యక్షత వహించిన చేనేత, జౌళిశాఖ సహాయ సంచాలకుడు రాఘవరావు మాట్లాడుతూ పూర్తి చేసిన దరఖాస్తులు కమిషనర్ చేనేత, జౌళి శాఖ కార్యాలయం, చేనేత భవన్, మూడో అంతస్తు నాంపల్లి హైదరాబాద్‌కు రిజిస్టర్ పోస్టు ద్వారా గాని స్వయంగా అందించాలన్నారు. కార్యక్రమంలో డెవలప్‌మెంట్ ఆఫీసర్లు బొట్టు వెంకటేశ్వర్లు, బిజ్జా వెంకటేశ్వర్లు, డీసీసీ బ్యాంకు డైరెక్టర్ ఎలగం రవిరాజు, చేనేత సమాఖ్య అధ్యక్షుడు పంతగాని శ్రీనివాస్, మంత్రి లింగమూర్తి, సహకార సంఘాల అధ్యక్షులు ఎలగం పెద్ద భద్రయ్య, చిన్న భద్రయ్య, అడిగొప్పుల సంపత్, కూరపాటి సంపత్, పిట్టా రాములు, పరికిపండ్ల రమేశ్,ఎలగం సాంబయ్య, మాచబత్తుల కుమారస్వామి, శామంతుల శంకర లింగం, దానం రాజయ్య, లింగబత్తిని పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సును తప్పించబోయి..

● రోడ్డు పక్కకు ఒరిగిన గ్రానైట్ లారీ
● కిందపడిన రాళ్లు..తప్పిన ప్రమాదం
● ఊపిరిపీల్చుకున్న ప్రయాణికులు



గుంతలో పడిన రాళ్లు

కురవి: ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును తప్పించబోయి మూలమలుపు వద్ద గ్రానైట్ లోడ్‌తో వెళ్తున్న లారీ చెట్టుకొమ్మకు తగిలి అదుపు తప్పి రోడ్డు పక్కకు ఒరిగింది. ఆర్టీసీ బస్సుపై పడే రాళ్లు రోడ్డు పక్కన పడడంతో పెనుప్రమాదం తప్పింది. ఈ ఘటన శనివారం ఉదయం కురవి మండల కేంద్రం శివారు ఖమ్మం వెళ్లే 365/ఏ జాతీయ రహదారిపై జరిగింది. గూడూరు మండలం తీగలవేణిలోని ఓ క్వారీ నుంచి గ్రానైట్ లోడ్‌తో ఓ లారీ ఖమ్మం వెళ్తోంది. ఈ క్రమంలో కురవి శివారులోని గ్యాస్‌గోదాం సమీపంలో మూలమలుపు వద్దకు చేరుకోగానే ఎదురుగా ఖమ్మం నుంచి ఆర్టీసీ బస్సు వచ్చింది. దీంతో గ్రానైట్‌లోడ్ లారీని నడుపుతున్న డ్రైవర్ ఒక్కసారిగా బస్సును తప్పించబోయే క్రమంలో రోడ్డు పక్కన ఉన్న చెట్టు కొమ్మ రాళ్లకు తగిలింది. లోడ్‌తో ఉన్న లారీ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న గుంతలో ఒరిగింది. అందులోని రాళ్లు గుంతలో పడ్డాయి. దీంతో బస్సుకు పెనుప్రమాదం తప్పింది. ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు.

కొమ్మ విరిగింది.. గూడు చెదిరింది..

● నాలుగు పిట్ట పిల్లలు మృతి

కురవి మండల కేంద్రం శివారులోని గ్యాస్ గోదాం సమీపంలో మూలమలుపు వద్ద గ్రానైట్ లారీపై ఉన్న రాళ్లు పెద్ద చెట్టు కొమ్మను తాకడంతో కొమ్మ విరిగిపోయింది. దీంతో చెట్టు కొమ్మ తొర్రలో పక్షి పెట్టిన గూడు చెదిరింది. అందులో ఉన్న కళ్లు సైతం తెరవని నాలుగుపక్షి పిల్లలు రోడ్డుపై పడి పోయి చనిపోయాయి. ఈ దృశ్యం రోడ్డు ప్రమాదాన్ని చూసేందుకు వచ్చిన జనాల మనస్సులు కలచివేసింది.



చనిపోయిన నాలుగు పక్షి పిల్లలు(సర్కిలోనివి)

ఒక టీచర్.. ఇద్దరే విద్యార్థులు

● ఉన్న ఇద్దరూ గైర్హాజరు..
● సాయంత్రం వరకు ఒంటరిగా కూర్చున్న ఉపాధ్యాయుడు
● పాతతండా జీపీ ప్రభుత్వ పాఠశాలలో ఘటన

కేసముద్రం: ఓ ప్రభుత్వ పాఠశాలలో ఇద్దరే విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరికి ఒక టీచర్ ఉన్నారు. అయితే ఉన్న ఇద్దరు విద్యార్థులు కూడా పాఠశాలకు గైర్హాజరు కావడంతో పాఠం బోధించడానికి ఎవరూ లేకపోవడంతో ఆ టీచర్ సాయంత్రం వరకు ఒంటరిగా కూర్చున్నాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండలం పాతతండాజీపీలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. పాత తండా జీపీలోని ప్రాథమిక పాఠశాలలో గతేడాది 8 మంది విద్యార్థులున్నారు. ఈ క్రమంలో ఇనుగుర్తి ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాల నుంచి టీచర్ కోటేశ్వర్‌రావు ఈ పాఠశాలకు బదిలీ అయ్యాడు. తీరా స్కూల్‌కు వచ్చి చూస్తే విద్యార్థులు ఎవరూ లేరు. దీంతో తండాలోని ఇంటింటికీ వెళ్లి మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపమని కోరుతూ వచ్చాడు. అప్పటికే తండాలోని విద్యార్థులు ప్రైవేట్ స్కూల్‌కు వెళ్తున్నారు. చివరకు ఇద్దరు పిల్లలను పంపడానికి తల్లిదండ్రులు అంగీకరించారు. అయితే ఆ ఇద్దరిలో ఓ విద్యార్థి స్కూల్‌కు రావడం లేదు. వస్తున్న ఒక్క విద్యార్థికి టీచర్ చదువు చెబుతున్నాడు. ఈక్రమంలో ఉన్న ఆ ఒక్క విద్యార్థికి జ్వరం రావడంతో శనివారం స్కూల్‌కు హాజరుకాలేదు. దీంతో ఆ టీచర్ ఉదయం నుంచి సాయంత్రం వరకు ఒంటరిగా కూర్చున్నాడు.



పాతతండాజీపీ ప్రాథమిక పాఠశాల



పాఠశాలలో ఒంటరిగా కూర్చున్న టీచర్

తాళం వేసి ఉన్న షాపులే టార్గెట్..

● వరుస చోరీలకు పాల్పడుతున్న దొంగ అరెస్ట్
● వివరాలు వెల్లడించిన ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరెడ్డి

వరంగల్ క్రైం: రాత్రి సమయంలో తాళం వేసి ఉన్న షాపుల్లో వరుస చోరీలకు పాల్పడుతున్న దొంగను అరెస్ట్ చేసినట్లు సుబేదారి ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. పీఎస్ పరిధిలోని హంటర్‌రోడ్డులో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో హనుమకొండ దీన్‌దయాల్ నగర్‌కు చెందిన భూతరాజు సందీప్ అనుమానాస్పదంగా కనిపించాడు. దీంతో అదుపులోకి తీసుకుని విచారించగా రాత్రి సమయంలో తాళం వేసి ఉన్న షాపుల్లో వరుస చోరీలకు పాల్పడుతున్నట్లు ఒప్పుకున్నాడు. భూతరాజు సందీప్ సాయికేర్ ఆసుపత్రిలో రిసెప్షనిస్టుగా పనిచేస్తున్నాడు. వచ్చిన వేతనం జల్సాలకు సరిపోకపోవడంతో నగరంలో రాత్రి సమయంలో పలు షాపుల్లో చోరీలకు పాల్పడుతున్నాడు. ఆయా షాపుల తాళాలు పగులగొట్టి రూ.4.50 లక్షలు అపహరించాడు. దీంతో పాటు హైదరాబాద్, హనుమకొండలో మూడు బైకులు, మూడు సెల్‌ఫోన్లు చోరీ చేశాడు. ఈ ఘటనలపై గత సంవత్సరం జైలుకెళ్లొచ్చినా తన ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాకపోగా తిరిగి చోరీలకు పాల్పడుతున్నాడు. భూతరాజు సందీప్ మొత్తం 21 చోరీలకు పాల్పడినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభకనబర్చిన ఏఎస్సై పాపయ్య, కానిస్టేబుళ్లు అలీ, ప్రభాకర్‌ను ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ రెడ్డి అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ రెడ్డి

నేటి జాతీయ స్థాయి సమావేశానికి బాలిరెడ్డి



అల్లం బాలిరెడ్డి

గీసుకొండ: మండలంలోని జాతీయ ఉత్తమ గ్రామపంచాయతీ మరియపురం మాజీ సర్పంచ్ అల్లం బాలిరెడ్డికి రాజీవ్‌గాంధీ 80వ జయంతి సందర్భంగా నిర్వహించే జాతీయ స్థాయి రౌండ్ టేబుల్ జూమ్ మీటింగ్‌లో పాల్గొనాలని ఆహ్వానం అందింది. రాష్ట్రం నుంచి గ్రామపాలనపై సమావేశంలో పాల్గొనేది బాలిరెడ్డి ఒక్కరే కావడం విశేషం. గడిచిన ఐదేళ్లలో గ్రామాన్ని ప్రజలు, మహిళా పొదుపు సంఘాల సహకారంతో జాతీయ స్థాయిలో ఉన్నతంగా తీర్చిదిద్దిన తీరును ప్రశంసిస్తూ ఆయనను ఈ సమావేశానికి ఆహ్వానించారు. అకాడమీ ఆఫ్ గ్రాస్‌రూట్స్ స్టడీస్ అండ్ రీసెర్చ్ ఆఫ్ ఇండియా(తిరుపతి) ఆధ్వర్యంలో 'రాజీవ్ గాంధీ విజన్ అండ్ మిషన్ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా ఇన్ ద ట్వంటీ ఫస్ట్ సెంచరీ' అనే అంశంపై నిర్వహిస్తున్న సమావేశంలో బాలిరెడ్డితో పాటు గ్రామానికి చెందిన పొదుపు సంఘాల మహిళలు ఈ జూమ్ సమావేశంలో పాల్గొననున్నారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి నిర్వహించే జూమ్ మీటింగ్ కోసం మరియపురంలో ఏర్పాట్లు చేశారు. కాగా, బాలిరెడ్డి సర్పంచ్‌గా విధులు నిర్వహించిన ఐదేళ్ల కాలంలో 8 జాతీయ స్థాయి సదస్సుల్లో పాల్గొన్నారు.

తండ్రి హత్య కేసులో కూతురు, అల్లుడి అరెస్ట్

భూపాలపల్లి అర్బన్: ఆస్తి కోసం తండ్రిని చంపిన ఘటనలో కూతురు, అల్లుడితోపాటు మరో నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ నరేశ్‌కుమార్ కథనం ప్రకారం.. భూపాలపల్లి పట్టణంలోని కారల్ మార్క్స్ కాలనీకి చెందిన బొమ్మన లక్ష్మారెడ్డి(66) తన ఆస్తిని తన పెద్ద బిడ్డ పేరున రాయించి ఇస్తానని పలుమార్లు చెప్పడంతో చిన్న కూతురు మహేశ్వరి, ఆమె భర్త చంపాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో ఈ నెల 12వ తేదీన తమ ఇంటికి తీసుకెళ్లి అత్యాయత్నానికి పాల్పడగా లక్ష్మారెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఈ ఘటనపై పెద్దకూతురు రాజేశ్వరీ ఆమె భర్త జగన్‌మోహన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు చిన్న కూతురు మహేశ్వరి ఆమె భర్తతోపాటు ముత్తయ్య, కవ్వాల మహేశ్, శనిగరపు రాజు, లింగాల కృష్ణను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ నరేశ్ కుమార్ శనివారం తెలిపారు.